# News Items in Various Daily News Papers on 14-12-2016

## In Namaste Telangana :





మంగళవారం ఎర్రమంజిల్ ఆర్అండ్‌బీ, ఈఎన్సీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

# ప్రతిష్ఠాత్మకంగా 77వ ఐఆర్సీ సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రతిష్ఠాత్మక 77వ ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ సదస్సు నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, ఈ సదస్సును విజయవంతం చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ సదస్సు జరుగనుందని తెలిపారు. మంగళవారం ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సదస్సులో దేశ విదేశాలకు చెందిన ఇంజినీర్లు, వృత్తి నిపుణులు పాల్గొంటారని, రోడ్ల నిర్మాణంలో వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానం, రహదారి భద్రత తదితర విషయాలపై చర్చిస్తారని చెప్పారు. భవిష్యత్తులో చేపట్టే అన్ని నిర్మాణాలను ఐఆర్సీ మార్గదర్శకాల ప్రకారం చేపడుతామని తెలిపారు. ఐఆర్సీ సదస్సు 15న ప్రారంభమవుతుందని, 17న కేంద్ర ఉపరిత రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ మెగా ఈవెంట్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. గౌరవ అతిథిగా సీఎం కేసీఆర్ పాల్గొంటారని తెలిపారు. గత ప్రభుత్వాలు 60 ఏండ్లలో 2,600కిలోమీటర్ల నిడివి గల జాతీయ రహదారులను సాధిస్తే.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు తాము 2,656కిలోమీటర్ల జాతీయ రహదారులను సాధించామని పేర్కొన్నారు. మొదటి రోజు సాంకేతిక ప్రదర్శనను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రారంభిస్తారు. రెండవ రోజు టెక్నికల్ సెషన్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ చంద్ర ప్రారంభిస్తారు. విలేకరుల సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఎన్సీలు బిక్షపతి, గణపతిరెడ్డి, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సదస్సు ప్రత్యేకతలు..

- నాణ్యమైన నిర్మాణాలకు తీసుకోవాల్సిన చర్యలపై జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సూచనలు.
- నిర్మాణ రంగాల పరికరాలు, పనిముట్లు, యంత్రాల ప్రదర్శన.
- ఐఆర్సీ స్మారక ప్రచురణ, ప్రజా పనుల శాఖల కార్యదర్శులు, ఈఎన్సీలు, ఇంజినీర్లతో ఉన్నతస్థాయి సమావేశాలు.
- సదస్సులో 2500 మంది దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొంటారు.
- దేశంలోని 26 రాష్ట్రాల నుంచి వృత్తి నిపుణులు, యంత్రాల తయారీదారులు హాజరవుతారు.
- సదస్సుకు వచ్చే ప్రతినిధులకు వసతి, భోజన, రవాణా సౌకర్యాల ఏర్పాటు.
- సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు.
- సదస్సులో ఐఆర్సీ నూతన కార్యవర్గం ఎంపిక.

నమస్తే తెలంగాణ Wed, 14 December 2016 epaper.namasthetelangaana.com/c/153

In EENADU :

# అంతర్జాతీయ ప్రమాణాలతో రహదారులు!

- గురువారం నుంచి ఐఆర్‌సీ సమావేశాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

**ఈనాడు, హైదరాబాద్:** 'తెలంగాణలో రహదారుల నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఉండాలన్నది ప్రభుత్వ నిర్ణయం. రోడ్ల నిర్మాణానికి ఇండియన్ రోడ్ కాంగ్రెస్ నియమావళే ప్రామాణికం. దేశ, అంతర్జాతీయ నిపుణులు మేధోమధనం చేసి ప్రస్తుత ప్రమాణాల్లో మార్పులు చేర్పులు చేయాలి. ఆ మేరకు రహదారులను నిర్మించాలన్నది వ్యూహం' అని తెలంగాణ రాష్ట్ర రహదారులు-భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సమావేశ వివరాలను వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 18 వరకు ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) 77వ జాతీయ సమావేశాలకు తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యమిస్తోంది. ఇప్పటి వరకు 26 రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యేందుకు నమోదు చేసుకున్నారు. విదేశాల నుంచి కూడా ఆసక్తి చూపుతున్నారు. వివిధ శాఖల సమన్వయంతో సమీకృత రవాణా వ్యవస్థ, ఇంధన పరిమిత వినియోగం, కార్బన్ ఉద్గారాలపై నియంత్రణతోపాటు రీ సైక్లింగ్ విధానాలు, తదితర అంశాలపై సదస్సులో మేధోమధనం చేసి నూతన ప్రమాణాలను రూపొందిస్తారు. రహదారుల నిర్మాణంలో ప్రస్తుతమున్న అటవీ, వన్యప్రాణి చట్టాలతో కొంత ఇబ్బంది ఉంది. ఆ నిబంధనలకు ఆటంకం లేకుండా నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరముంది. గతంలో పది శాతం భూసేకరణ పూర్తి చేసినా పనులు చేపట్టేవారు. ప్రస్తుతం పూర్తిగా భూసేకరణ అయిన తరవాతే పనులు చేపట్టాలన్నది కేంద్ర నిర్ణయం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 2,600 కిలోమీటర్ల మేర మాత్రమే జాతీయ రహదారులున్నాయి. సీఎం కేసీఆర్ ప్రోద్బలంతో మరో 2,650 కిలోమీటర్లను అదనంగా కేంద్రం కేటాయించింది. కేంద్రం తాజాగా ప్రకటించిన జాతీయ రహదారులకు సంబంధించిన సమగ్ర అధ్యయన నివేదిక(డీపీఆర్)లు తయారవుతున్నాయి.

**17న గడ్కరీ, కేసీఆర్ హాజరు:** సదస్సులో 17న సీఎం కేసీఆర్, కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ కీలకోపన్యాసం చేస్తారు' అని తుమ్మల వివరించారు. విలేకరుల సమావేశంలో ఆర్‌అండ్‌బీ అధికారులు రవీంద్రరావు, బిక్షపతి, గణపతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి మహేందర్ పాల్గొన్నారు.

In Vaartha:

# రేపటి నుంచి 18 వరకు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ వార్షిక సమావేశాలు

- 28 రాష్ట్రాల నుంచి 3500 మంది ఇంజినీర్లు, నిపుణులు హాజరు
- రాష్ట్రంలో నాణ్యమైన, ప్రమాదరహిత రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు
- రూ.13,380కోట్లతో 12790 కి.మీ. రోడ్లను రెండు, నాలుగు లైన్లుగా అభివృద్ధి
- 338 కి.మీ. రీజినల్ రింగ్ రోడ్డుకు కేంద్రం ఆమోదం: మంత్రి తుమ్మల



**హైదరాబాద్, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** గురువారం నుంచి 18 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సి) వార్షిక సమావేశాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని..దీనికి దేశంలోని 28 రాష్ట్రాల నుంచి 3500 మందిప్రముఖ ఇంజినీర్లు, రవాణా రోడ్ల నిపుణులు హాజరవుతారని తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ సమావేశాల్లో రోడ్ల నిర్మాణంలో ఆధునిక పద్ధతులతో నాణ్యమైన నిర్మాణాలతోపాటు..ప్రమాద రహితంగా రోడ నిర్మాణంపై మేథోమథనం చేసి రాష్ట్రానికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని ఆయన స్పష్టం చేశారు. 338 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఆమోదం తెలిపిందని నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం ఎర్రమంజిల్‌లోని ఆర్అండ్‌బి ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఇఎన్‌సి) కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తుమ్మల మాట్లాడారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా రహదారి భద్రత, రోడ్ల నాణ్యత, పర్యావరణ అనుకూల నిర్మాణాలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈసమావేశాల్లో 17న కేంద్ర ఉపరితల రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి కేసిఆర్‌లు సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

ఇంజినీర్లకు, వృత్తి నిపుణులకు రోడ్ల నిర్మాణంలో ఈ ఐఆర్‌సి సమావేశాలు మార్గనిర్దేశం చేస్తాయని మ ంత్రి తెలిపారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఈసమావేశాలు మనరాష్ట్రంలోని ఇంజినీర్లకు, కాంట్రాక్టర్లు, నిపుణులకు తమ పరిజ్ఞానం పెంచుకోవడంతో తద్వారా ఈ ఐఆర్‌సి సమావేశాల్లో రోడ్ల నిర్మాణానికీ, నిర్వహణకు ప్రమాణాలను నిర్దేశించటం, సాంకేతిక మెలుకువలను మెరుగపర్చడం, నిర్మాణ పద్ధతులు, నూతన యంత్రాల వినియోగం, పర్యావరణ హితమైన నిర్మాణం, పర్యావరణహితమైన పదార్థాల వినియోగం, రహదారుల భద్రత, ప్రమాద నివారణ వంటి అనేక అంశాలపై నిపుణులు చర్చించి మార్గ సూచి చేయటం జరుగుతుందన్నారు. ఈ సమావేశ ఫలాలు మెరుగైన రోడ్ల నిర్మాణానికి, మెరుగైన జీవన ప్రమాణాలకు ఎంతో సహకరిస్తాయన్నారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి ఈ 77వ ఐఆర్‌సి సమావేశాల వల్ల చాలా మేలు జరుగుతుందని..ప్రధానంగా పర్యావరణ హితమైన నిర్మాణం నిర్వహణ, ఇంధన పరిమిత వినియోగం, కార్బన్ ఉద్గారాలపై తగు నియంత్రణ, నూతన నిర్మాణ పద్ధతులు, రీసైక్లింగ్ పద్ధతులు, సహజ వనరుల వినియోగంపై నియంత్రణ, ఇంటిగ్రేటెడ్ రవాణ వ్యవస్థ, ప్రమాదరహిత ప్రయాణం లాంటి ప్రయోజనాలు లభిస్తాయని తుమ్మల పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయంగా ఎంతో ప్రాముఖ్యం ఉన్న ఈ ఐఆర్‌సి సమవేశాలను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు.

కాగా సిఎం కేసిఆర్ ప్రోద్బలంతో రాష్ట్రానికి మరో 2655 కి.మీ. పొడవు గల నూతన జాతీయ రహదారులు మంజూరైనాయని, ఇప్పటి వరకు ఉన్న 2573 కి.మీ.లకు ఇది అదనమని మంత్రి తెలిపారు. అంతేకాక ఈరాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర రహదారులు, వంతెనల విస్తరణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని. సుమారు రూ.13,380 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 12790 కి.మీ. నిడివిగల రోడ్లను 2, 4 లైన్లుగా అభివృద్ధి చేయటానికి, రెనూ వ్యవల్స్‌కు ప్రణాళికలు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రం తలపెట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో ఈ 77వ వార్షిక ఐఆర్‌సి సమావేశాలు మన రాష్ట్రానికి, రహదార్ల నిర్మాణానికి, నిర్వహన వ్యవస్థకు మెరుగైన జీవన ప్రమాణాలకు ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

వార్త Wed, 14 December 2016
epaper.vaartha.com//c/15345802

In Mana Telangana :

# రేపటి నుంచి ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సు

- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**మన తెలంగాణ/హైదరాబాద్:** రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, పర్యావరణ అనుకూల విధానాలపై చర్చించేందుకు ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ పేరిట ఒక అంతర్జాతీయ సమావేశం నిర్వహించనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్అండ్‌బి ఇఎన్‌సి ప్రధాన కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సుమారు 3వేల మంది వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశం కోసం మాదాపూర్ హైటెక్స్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ మూడు రోజుల సదస్సులో తొలిరోజు సాంకేతిక ప్రదర్శన, రెండో రోజు చీఫ్ సెక్రటరీ ప్రదీప్‌చంద్ర ఆధ్వర్యంలో టెక్నికల్ సదస్సు కొనసాగనుండగా, ప్రధానంగా 17న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు హాజరు కానున్నారని వివరించారు. జాతీయ రహదారుల ఇంజనీర్లు, పరిశోధన శాస్త్రవేత్తలు, కన్సల్టెంట్లు, నిపుణులు, ఇతర వృత్తి నిపుణులు సమావేశమై రహదారుల గురించి, అలాగే సాంకేతికత, విధానపర సమస్యల గురించి కూలంకషంగా చర్చిస్తారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇది 77వ సమావేశమని, గతంలో హైదరాబాద్‌లోనే రెండు పర్యాయాలు నిర్వహించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు. ఇంజనీర్లకు, వృత్తి నిపుణులకు రహదారుల నిర్మాణంలో ఈ సమావేశాలు తగిన మార్గనిర్దేశం చేస్తాయని ఆశిస్తున్నట్లు తుమ్మల తెలిపారు. భవన నిర్మాణం, నాణ్యత ప్రమాణాలు, పర్యావరణహిత అంశాలపై ఇంజినీర్లకు విషయ పరిజ్ఞాన మార్పిడి జరుగుతుందని భావిస్తున్నామన్నారు. ఆధునిక పద్ధతుల్లో రోడ్ల నిర్మాణం, పరికరాలు, పనిముట్లు యంత్రాలకు సంబంధించిన ప్రదర్శన కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.

మన తెలంగాణ
Wed, 14 December 2016
epaper.manatelangana.news//c/15345936

In Nava Telangana :

# ప్రమాదరహితంగా రోడ్ల నిర్మాణం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

- హైదరాబాద్ రీజనల్ రింగురోడ్‌కు కేంద్రం ఆమోదం: రోడ్లు,భవనాల శాఖ మంత్రి తుమ్మల
- 15 నుంచి ఇండియన్ రోడ్ కాంగ్రెస్
- వివిధ దేశాల నుంచి 3500 మంది ప్రతినిధుల రాక

**నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్**

నిర్మాణ లోపాలను సరిదిద్దుతూ ప్రమాదరహిత రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ నిబంధనల మేరకు రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. రాష్ట్రానికి కొత్తగా 2650 కి.మీ జాతీయ రహదారులు మంజూరు చేసి తెలంగాణలోని 31 జిల్లాలకు జాతీయ రహదారుల అనుసంధానం జరిగేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్ ఆర్ అండ్ బి ఈఎన్‌సీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15 నుంచి 18 వరకు హైదరాబాద్ హైటెక్స్‌లో 77వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ వార్షిక సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నూతన నిర్మాణ పద్ధతులు, పర్యావరణం, ఇంధన పరిమిత వినియోగం, రీసైక్లింగ్ పద్ధతులు, ఇంటిగ్రేటెడ్ రవాణా వ్యవస్థ, రహదారి భద్రత, ప్రమాదాల నివారణ తదితర సాంకేతిక అంశాలపై మేథో మధనం చేయనున్నట్టు మంత్రి వెల్లడించారు. 17న కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సమావేశానికి హాజరు కానున్నారు. వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి సుమారు 3500 మంది ప్రతినిధులు పాల్గొననున్నారని వివరించారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

**రింగు రోడ్‌కు కేంద్రం ఓకే**

హైదరాబాద్ మహా నగరం చుట్టూ రీజనల్ రింగు రోడ్ నిర్మాణానికి కేంద్రం ఆమోదించినట్టు మంత్రి తుమ్మల వెల్లడించారు. సంగారెడ్డి – నర్సాపూర్ – గజ్వేల్ – జగదేవ్‌పూర్ – భువనగిరి – చౌటుప్పల్ – చేవెళ్ళ – శంకర్‌పల్లి – కంది – సంగారెడ్డి వరకు సుమారు 320 కిమీ వరకు రింగురోడ్‌ను జాతీయ రహదారిగా గుర్తించి నిధులు మంజూరు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని కేంద్రం అంగీకరించిందని, దీనికి సంబంధించి త్వరలోనే డీపీఆర్ ను సమర్పిస్తామన్నారు. గతం లో రూపొందించిన డీపీఆర్‌లకు కేంద్రం రూ.2690 కోట్లు విడుదల చేయడా నికి నిర్ణయం తీసుకుందని చెప్పారు.

నవతెలంగాణ
Wed, 14 December 2016
epaper.navatelangana.com/c/15330887

In Andhra Jyothi :



ఇండియన్ రోడ్ కాంగ్రెస్ కాన్ఫరెన్స్ కర్టెన్‌రైజర్ భేటీలో మంత్రి తుమ్మల

# ప్రమాద రహిత రహదారులే లక్ష్యం

## • రేపటి నుంచి ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సు: తుమ్మల

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రమాద రహిత రహదారుల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఇందుకోసం కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఐఆర్‌సీ మార్గదర్శకాలకు లోబడే నిర్మాణాలను చేపట్టనున్నట్లు, అన్ని నదులపై బ్రిడ్జీలు నిర్మించి.. జల రవాణాకు కూడా అవకాశం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సు జరుగనున్న నేపథ్యంలో.. నిర్వహణకు సంబంధించిన వివరాలను మంత్రి తుమ్మల మంగళవారం వెల్లడించారు. ఈ సదస్సుకు విదేశీ ప్రతినిధులు హాజరు కానున్నారు. సదస్సు ప్రారంభానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం కేసీఆర్ హాజరు కానున్నారు. కాగా ఈ సదస్సు 1927లో ఎంఆర్ జయకర్ నేతృత్వంలో ఏర్పాటైన ఐఆర్‌సీ 77వ సమావేశం. 73మంది సభ్యులతో ఏర్పాటైన ఐఆర్‌సీలో ప్రస్తుతం 16,700మంది సభ్యులు ఉన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణంలో వస్తున్న మార్పులు, పాటించాల్సిన ప్రమాణాలు, కొత్త టెక్నాలజీ వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. కాగా రాష్ట్రంలో చేపట్టిన రోడ్ల గురించి మంత్రి తుమ్మల వివరిస్తూ.. తెలంగాణ రాష్ట్రంలో కొత్త టెక్నాలజీని ఉపయోగించి ప్రమాదాలు జరగనివిధంగా రోడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు.

ఆంధ్రజ్యోతి Wed, 14 December 2016
epaper.andhrajyothy.com//c/15344574

In Sakshi :

# రోడ్ల నిర్మాణంలో సాంకేతిక విప్లవం

- దిశానిర్దేశం చేయనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్
- 15 నుంచి నగరంలో జాతీయ సదస్సు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా మెరుగైన రోడ్ల అనుసంధాన వ్యవస్థ ఉండేలా కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానం తోడుకాబోతోంది. ఇందుకు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సు సహకరించబోతోంది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాల అనుసంధానం, రాజధానితో వాటి జోడింపు, నదులు, వాగులు, వంకలపై వంతెనల నిర్మాణం భారీగా చేపడుతున్న విషయం తెలిసిందే. దాదాపు రూ.12,500 కోట్ల వ్యయంగాగల పనులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపగా.. రూ.5 వేల కోట్ల పనులు మొదలయ్యాయి. ఇప్పుడు హైదరాబాద్ వేదికగా జరగబోయే ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సులో ఈ ప్రాజెక్టుకు ఓ దిశానిర్దేశం లభించబోతోంది. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా రోడ్ల నిర్మాణంలో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం, ప్రమాద రహితంగా ఉండేలా కొత్త నమూనాల రూపకల్పనలపై చర్చించి తెలంగాణ పనులకు సూచనలు ఇవ్వబోతోంది.

**మాదాపూర్‌లో హైటెక్స్ వేదికగా..**

మాదాపూర్‌లోని హైటెక్స్ వేదికగా ఈ నెల 15 నుంచి నాలుగు రోజుల పాటు జరగబోయే 77వ సదస్సులో దాదాపు మూడున్నర వేల మంది ప్రతినిధులు పాల్గొనబోతున్నారు. ఇందులో అన్ని రాష్ట్రాల రహదారుల శాఖ ఉన్నతాధికారులతోపాటు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, ఇంజనీర్లు, పర్యావరణవేత్తలు హాజరవుతున్నారు. కొత్త పద్ధతులపై అవగాహన కల్పించేందుకు విదేశీ ప్రతినిధులు కూడా హాజరవుతున్నారు. 17న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రశేఖర రావులు పాల్గొంటారు.



**ఇదో గొప్ప అవకాశం: తుమ్మల**

తెలంగాణను రోడ్ నెట్‌వర్క్‌లో నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్న తరుణంలో హైదరాబాద్‌లో ఈ సదస్సు నిర్వహించాల్సి రావటం ఓ గొప్ప అవకాశం. ప్రమాద రహితంగా, పర్యావరణ అనుకూల పద్ధతుల్లో రోడ్లు, వంతెనల నిర్మాణానికి కొత్త సూచనలు అందనున్నాయి.

Wed, 14 December 2016
epaper.sakshi.com//c/15345671

In Andhra Prabha :

## తెలంగాణకు వన్నె తెచ్చేలా...
# ఘనంగా ఐఆర్‌సీ సమావేశాలు

- 77వ అంతర్జాతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక
- ఈ నెల 15 నుంచి 18 వరకు హెచ్‌ఐసీసీలో సమావేశాలు
- రహదారుల నిర్మాణాలపై నూతన సాంకేతికతలు
- కీలక ఒప్పందాలు



**ఆంధ్రప్రభ, హైదరాబాద్ :** నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం మరో ఘనతకు చేరువవుతోంది. అంతర్జాతీయ, జాతీయ సమావేశాలకు వేదికగా మారిన హైదరాబాద్ తాజాగా ఐఆర్‌సీ వార్షిక సమావేశాలకు వేదికగా నిలుస్తోంది. జాతీయ, అంతర్జాతీయంగా ఎంతో ప్రాముఖ్యం కలిగిన ఐఆర్‌సీ సమావేశాలను తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రానికి మరింత వన్నె తెచ్చేలా ఈనెల 15నుంచి 18 వరకు హైదరాబాద్‌లో జాతీయ రహదారుల కాంగ్రెస్‌ను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 77వ వార్షిక సమావేశాలకు సంబంధించిన ముఖ్య అంశాలను ఆయన మంగళవారం మీడియాకు వివరించారు.

ఇంజనీర్లకు, వృత్తి నిపుణులకు రహదారుల నిర్మాణంలో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ మార్గనిర్దేశనం చేయనుంది. నూతన నిర్మాణ పద్ధతులు, పర్యావరణ సంబంధిత విషయాలు, రహదారి భద్రత, ప్రమాద నివారణ వంటి అంశాలపై 3రోజులపాటు మేధోమథనం జరగనుంది. ఇందులో భాగంగా నాణ్యతా ప్రమాణాలు, సాంకేతిక అంశాల పరస్పర పరిజ్ఞానాన్ని మార్పిడి చేసుకునేందుకు చర్చలు జరగనున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ సమావేశాలు మన రాష్ట్రంలో ఇంజనీర్లకు, కాంట్రాక్టర్లకు, వృత్తి నిపుణులకు ఎంతగానో ఉపయుక్తం కానున్నాయి. రహదార్ల నిర్మాణాలకు, నిర్వహణకు ప్రమాణాలను నిర్దేశించడం, సాంకేతిక మెళకువలను మెరుగుపర్చడం, నూతన యంత్రాల వినియోగం, రహదారుల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై నిపుణులు చర్చించి మార్గనిర్దేశనం చేయనున్నారు. రాష్ట్రంలో 2656 కిలోమీటర్ల నిడివితో నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు ఉన్న 2573 కిలోమీటర్లకు ఇది అదనం. ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న రహదారులు, వంతెనల నిర్మాణంతో రూ. 13,380కోట్ల పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో 77వ వార్షిక ఐఆర్‌సీ సమావేశాలు రాష్ట్రానికి ఎంతో కీలకంగా ఉపయుక్తంగా మారనున్నాయి. మెరుగైన జీవన ప్రమాణాలకు ఇది మరింత సహకరించనుంది.

ప్రతీ ఏడాది ఐఆర్‌సీ వార్షిక సమావేశాలు నాలుగు రోజులపాటు దేశంలోని ప్రముఖ నగరాల్లో నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో జాతీయ రహదారుల ఇంజనీర్లు, పరిశోధనా శాస్త్రవేత్తలు, కన్సల్టెంట్లు, నిపుణులు, ఇతర ప్రొఫెషనల్స్ సమావేశం కానున్నారు. ఇందులో సాంకేతిక, విధానపరమైన సమస్యల గురించి నిర్ణయాలు తీసుకోనున్నారు. గతంలో రెండుపర్యాయాలు హైదరాబాద్‌లో ఐఆర్‌సీ సమావేశాలు జరిగగా ఇది మూడోది కావడం గమనార్హం. తెలంగాణ సర్కార్ ఆహ్వానం మేరకు ఐఆర్‌సీ సెక్రటరీ జనరల్ 77వ వార్షిక రోడ్ కాంగ్రెస్‌ను హైదరాబాద్‌లో జరిపేందుకు ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ సమావేశాల్లో భాగంగా 17న జరిగే మెగా ఈవెంట్ ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం కేసీఆర్ హాజరు కానున్నారు. సమావేశాల్లో 3వేల మంది వివిధ రంగాల నిపుణులు హాజరయ్యే అవకాశముంది. 26 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, పలు దేశాల నిపుణులు సమావేశానికి హాజరుకానున్నారు. ఇందులో కీలకంగా సాంకేతిక అధ్యయన రంగాల్లో పరిశోధనా పత్రాలు, జాతీయ, అంతర్జాతీయ సాంకేతిక నిపుణులు ప్రసంగిస్తారు. నిర్మాణ, తయారీ రంగాల పరికరాలు, పనిముట్ల ప్రదర్శన ఉండనుంది. ఈ సమావేశాల్లో ఐఆర్‌సీ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గం ఏర్పాటు చేయనున్నారు.

Wed, 14 December 2016
epaper.prabhanews.com//c/15346078